RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ సీఎండీ & ఎడిటర్ 9701923260
సంపుటి: 4 సంచిక:97 | మార్చి 31, 2026 | వెల: రూ.3-00



## ప్రజావాణిలో అధికారిణి నిర్లక్ష్యం

- మొబైల్‌లో నిమగ్నం..
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఫిర్యాదు దారులు

2లో



మూగబోయిన అడవి

# మావోయిస్టు శకం ముగిసినట్టేనా?

## నేటితో కేంద్ర ప్రభుత్వ డెడ్ లైన్ పూర్తి

మావోయిజం అంతిమ ఘడియలు దేశ చరిత్రలో అతిపెద్ద మలుపు!

### మోస్ట్ వాంటెడ్ గణపతి ఎక్కడ?

- అజ్ఞాతంలో ఉన్నారా? లేక పోలీసుల సంరక్షణలోనా?
- తుపాకీ గొట్టం వదలి శాంతి వైపు అడుగులు
- భద్రతా దళాల దెబ్బకు చెల్లాచెదురైన ఎర్రజెండా కంచుకోటలు
- మావోయిస్టులకు శాపంగా మారిన టెక్నాలజీ
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రతిజ్ఞ నెరవేరిన వేళ..



2లో

వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి

తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం అంటూ దశాబ్దాల పాటు భారత అంతర్గత భద్రతకు సవాలు విసిరిన ఎర్రజెండా.. ఇప్పుడు తన ఉనికి కోసం చివరి పోరాటం చేస్తోంది. దేశవ్యాప్తంగా వందలాది జిల్లాలను వణికించిన రెడ్ కారిడార్ ఇప్పుడు చరిత్ర పుటల్లో కలిసిపోయే సమయం ఆసన్నమైంది. కేంద్ర ప్రభుత్వం అత్యంత వ్యూహాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ కగార్ డెడ్ లైన్ నేటితో ముగియనుండడంతో, భారత్‌లో మావోయిజం దాదాపు తుడిచిపెట్టుకుపోయిందనే వాదన వినిపిస్తోంది. ఒకవైపు అగ్రనేత గణపతి లొంగుబాటుపై మిస్టరీ ఇంకా వీడని మిస్టరీ.. మరోవైపు వరుస ఎన్‌కౌంటర్లు, అగ్రశ్రేణి కమాండర్ల లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ వెన్నుముక పూర్తిగా విరిగిపోయింది. అడవిలో అత్యాధునిక నిఘా నీడన కేడర్ కదల లేని స్థితికి చేరుకోగా, బస్తర్ నుంచి తెలంగాణ దాకా ఎర్ర సామ్రాజ్యం కుప్పకూలింది. భారత భద్రతా దళాల అలుపెరగని పోరాటం, హోం శాఖ దృఢ సంకల్పం వెరసి.. దేశం ఇప్పుడు మావోయిస్ట్ ముక్త భారత్ దిశగా చారిత్రాత్మక అడుగు వేస్తోంది. రక్తపాతంతో నిండిన సుదీర్ఘ అధ్యాయానికి ముగింపు పలుకుతూ అడవిలో శాంతి చిగురిస్తున్న వేళ.. అసలు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోంది? మావోయిస్టుల సామ్రాజ్యం ఎలా పతనమైంది? 'వేద న్యూస్' ప్రత్యేక కథనం...

## ఆయుధాలు వీడాల్సిందే..



- అభివృద్ధికి ఆటంకం కలిగిస్తే సహించం
- గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన
- నక్సలిజం రహిత భారత్ లక్ష్యం
- అమిత్ షా హెచ్చరిక

2లో

### ఇంట్లోకి చొరబడి..
## మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారం



2లో

### పశ్చిమాసియాలో పెరుగుతున్న
## యుద్ధ ఉద్రిక్తతలు

- ఇరాన్ ప్రతిదాడులతో ఇజ్రాయెల్‌లో గాయపడిన వేలాది మంది
- అమెరికా-ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్‌లో భారీ ప్రాణనష్టం
- నేవీ చీఫ్ మృతి నేపథ్యంలో మరింత ఉత్కంఠ

2లో

## కల్తీ నియంత్రణకు కొత్త మెకానిజం



ఆహార కల్తీపై ప్రత్యేక వ్యవస్థ

- సీఎం రేవంత్ రెడ్డి
- సన్నబియ్యం పథకానికి ఏడాది పూర్తి
- రైతులకు ప్రోత్సాహం.. పంట మార్పిడిపై దృష్టి

వేద న్యూస్, హైదరాబాద్

రాష్ట్రంలో ఆహార కల్తీని నియంత్రించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే అమల్లో ఉన్న ఈగల్, హైడ్రా తరహాలోనే కల్తీ నివారణకు ప్రత్యేక మెకానిజం తీసుకొస్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా అమలవుతున్న కల్తీ నిరోధక చట్టాలను అధ్యయనం చేసి పటిష్ట చర్యలు

మిగతా 2వ పేజీలో



## పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

- స్వతంత్ర న్యాయ విచారణ జరిపించాలి
- మంత్రి అక్రమాలపై గవర్నర్‌ను కలిసిన బీఆర్ఎస్
- సాక్ష్యాధారాలతో ఫిర్యాదు

వేద న్యూస్, హైదరాబాద్

రాష్ట్ర రాజకీయాల్లో భూకబ్జాలు, అక్రమ మైనింగ్ ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను కలిసి ఫిర్యాదు చేశారు. లోక్ భవన్‌లో దాదాపు గంటపాటు జరిగిన సమావేశంలో మంత్రి అక్రమాలపై సాక్ష్యాధారాలను సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా

మిగతా 2వ పేజీలో

వేద న్యూస్

మంగళవారం | మార్చి 31, 2026

# ప్రజావాణిలో అధికారిణి నిర్లక్ష్యం

## మొబైల్‌లో నిమగ్నం

### ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఫిర్యాదుదారులు

**వేద న్యూస్, కరీంనగర్**

కరీంనగర్ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఓ వైద్యాధికారి మొబైల్ ఫోన్‌లో నిమగ్నమై ఉండటం చర్చనీయాంశమైంది.



ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు నిర్వహించే ఈ కార్యక్రమంలో, ఫిర్యాదుదారుల మాట వినాల్సిన సమయంలో అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటల తరబడి క్యూలో నిలబడి వచ్చిన ప్రజలు తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కోసం ఎదురుచూస్తుండగా, అధికారి ఫోన్‌లో నిమగ్నమవడం విమర్శలకు దారి తీసింది. అంతేకాక, కార్యక్రమం జరుగుతున్న సమయంలో మరికొందరు అధికారులు కూడా ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజావాణి నిర్వహణ లక్ష్యాన్ని ఇలాంటి చర్యలు దెబ్బతీస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులే బాధ్యతారహితంగా వ్యవహరించడం వల్ల ప్రభుత్వంపై నమ్మకం దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఈ అంశంపై ఉన్నతాధికారులు స్పందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కల్తీ నియంత్రణకు కొత్త మెకానిజం

మొదటి పేజీ తరువాయి

చేపడతామని వెల్లడించారు. రాష్ట్రంలో 3.39 కోట్ల మందికి పంపిణీ చేస్తున్న సన్నబియ్యం పథకం ప్రారంభమై ఏడాది పూర్తైన సందర్భంగా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో శాసనసభ సెంట్రల్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులకు సన్నబియ్యంతో భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న దొడ్డుబియ్యాన్ని ప్రజలు వినియోగించకపోవడంతో మాఫియా పెరిగిందన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఖర్చు పెరిగినా పేదలకు ప్రయోజనం లేకపోయిందని పేర్కొన్నారు. అందుకే ప్రజలకు ఉపయోగపడే విధంగా సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. సన్నవడ్ల ఉత్పత్తిని పెంచేందుకు రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించినట్లు సీఎం వివరించారు. రైతులను ప్రోత్సహించి, పంట మార్పిడి విధానాలపై అవగాహన కల్పించడం ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. వాణిజ్య పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తూ, రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అక్రమ మైనింగ్, భూకబ్జాలకు పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. మంత్రి పదవిలో కొనసాగుతూనే విచారణను ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున వెంటనే బర్తరఫ్ చేయాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ పేరిట మైనింగ్ నిబంధనలను ఉల్లంఘించి, అనుమతులు లేకుండా జంట జలాశయాల పరిధిలో అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. మినరల్ డీలర్ లైసెన్స్, కాలుష్య నియంత్రణ అనుమతులు, విద్యుత్ కనెక్షన్లు లేకుండానే రెండు సంవత్సరాలుగా వందల కోట్ల ప్రజా సంపదను దోచుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తినప్పుడు ప్రభుత్వం స్పందించకపోవడంతో పాటు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సభ నుంచి బహిష్కరించారని కేటీఆర్ విమర్శించారు. అదే సమయంలో ప్రభుత్వం నోటీసులు ఇచ్చిన విషయాన్ని అంగీకరించినప్పటికీ, పూర్తి స్థాయి విచారణ జరపలేదని ఆరోపించారు. స్వతంత్ర విచారణ కోసం శాసనసభ, శాసనమండలి సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీలతో విచారణ జరిగితే న్యాయం జరగదని, అందుకే స్వతంత్ర దర్యాప్తు అవసరమని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి కంటే పెద్ద బ్లాక్ మెయిలర్ రాష్ట్రంలో ఎవరూ లేరని, ఆయన రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని మలుస్తున్నారని ఆరోపించారు. పొంగులేటిపై చర్యలు తీసుకోవడంలో ముఖ్యమంత్రి వెనుకడుగు వేస్తున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంలో గవర్నర్ జోక్యం చేసుకొని న్యాయం చేయాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. గవర్నర్ కూడా ఈ అంశంపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఇకపై ఈ అంశంపై ప్రజా స్థాయిలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, అక్రమాలు బయటపెట్టే వరకు వెనక్కి తగ్గబోమని కేటీఆర్ స్పష్టం చేశారు.

# మావోయిస్టు శకం ముగిసినట్టేనా?

నేటితో కేంద్ర ప్రభుత్వ డెడ్ లైన్ పూర్తి

మావోయిజం అంతిమ ఘడియలు దేశ చరిత్రలో అతిపెద్ద మలుపు!

**మోస్ట్ వాంటెడ్ గణపతి ఎక్కడ?**

- అజ్ఞాతంలో ఉన్నారా? లేక పోలీసుల సంరక్షణలోనా?
- తుపాకీ గొట్టం వదలి శాంతి వైపు అడుగులు
- భద్రతా దళాల దెబ్బకు చెల్లాచెదురైన ఎర్రజెండా కంచుకోటలు
- మావోయిస్టులకు శాపంగా మారిన టెక్నాలజీ
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రతిజ్ఞ నెరవేరిన వేళ..

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**



భారత అంతర్గత భద్రతా చరిత్రలో అత్యంత సుదీర్ఘమైన, రక్తపాతంతో కూడిన అధ్యాయం ముగింపు దశకు చేరుకుంది. దశాబ్దాల పాటు తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం అని నినదించిన మావోయిస్టు ఉద్యమం ఇప్పుడు తన అస్తిత్వ పోరాటంలో చివరి శ్వాస తీసుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక లక్ష్యంతో చేపట్టిన ఆపరేషన్ కగార్ డెడ్ లైన్ (మార్చి 31) నేటితో ముగియనుండడంతో, దేశవ్యాప్తంగా ఎర్రకోట పునాదులు కుప్పకూలాయి.

**గణపతి లొంగుబాటు మిస్టరీ..**

మావోయిస్టు పార్టీకి దశాబ్దాల పాటు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి లొంగుబాటు అంశం ఇప్పుడు హాట్ టాపిక్. ఆయన నేరుగా కేంద్ర మంత్రి అమిత్ షా సమక్షంలో లొంగిపోయారని, కేంద్రం దీనిని అత్యంత గోప్యంగా ఉంచిందని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. గణపతి వంటి అగ్రనేత లొంగుబాటు జరిగితే, అది మావోయిస్టు సిద్ధాంతానికే మరణశాసనం అవుతుంది. ప్రస్తుతం ఆయన అజ్ఞాతంలో ఉన్నారా లేక ప్రభుత్వ సంరక్షణలో ఉన్నారా అన్నది మిస్టరీగా ఉన్నప్పటికీ, 31న మావోయిస్ట్ ముక్త భారత్ ప్రకటన చేసే సమయంలో దీనిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవేళ ఆయన లొంగిపోవడం నిజమైతే, అది దేశ చరిత్రలో అతిపెద్ద లొంగుబాటుగా నిలిచిపోతుంది.

**మావోయిజంపై అంతిమ యుద్ధం**

2026 మార్చి 31.. ఈ తేదీ భారత భద్రతా దళాల డైరీలో ఒక మైలురాయిగా నిలవబోతోంది. దేశాన్ని నక్సలిజం నుంచి విముక్తం చేస్తాం అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా చేసిన ప్రకటన ఇప్పుడు వాస్తవరూపం దాల్చినట్టే కనిపిస్తోంది. ఒకప్పుడు పశుపతి నుంచి తిరుపతి వరకు రెడ్ కారిడార్‌ను విస్తరించాలని కలలు గన్న మావోయిస్టుల ప్రస్థానాన్ని అంతిమ దశకు చేరుకున్నట్టే కనిపిస్తోంది. 100 పైగా జిల్లాల్లో విస్తరించిన ఈ సమస్య, ఇప్పుడు దాదాపు పూర్తిగా అంతమొందడం భద్రతా దళాల సాధించిన అతిపెద్ద విజయం.

**అగ్రనేతల లొంగుబాటు..**

ఏ ఉద్యమానికైనా నాయకత్వమే వెన్నుముక. కానీ మావోయిస్టు పార్టీలో ఇప్పుడు ఆ వెన్నుముక విరిగిపోయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వరుసగా అగ్రనేతలు ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు. పార్టీ కీలక వ్యూహకర్తలు దేవూజీ, మల్లోజుల వేణుగోపాల్, రాజిరెడ్డి వంటి హేమాహేమీలు లొంగిపోవడం పార్టీని కోలుకోలేని దెబ్బ తీసింది. తెలంగాణ రాష్ట్ర కమిటీకి దిశానిర్దేశం చేసిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్, అలాగే ఆశన్న, సుధాకర్, పాపారావు అలియాస్ మంగు తోపాలు వంటి వారు వరుస దఫాలుగా లొంగిపోవడంతో అడవుల్లో పార్టీ కేడర్ దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. ఒక అగ్రనేత లొంగిపోవడం అంటే కేవలం ఒక వ్యక్తి తగ్గడం కాదు; వారి వెంట ఉండే రహస్య కమ్యూనికేషన్ నెట్‌వర్క్, ఫండింగ్ మార్గాలు, కొత్త నియామకాలకు సంబంధించిన వ్యవస్థ మొత్తం కుప్పకూలుతుంది. ఈ నాయకత్వ లోపం కారణంగానే కింది స్థాయి సభ్యులు కూడా భారీగా పోలీసుల ముందు లొంగుబాట పట్టారు.

**గణాంకాలు చెబుతున్న వాస్తవాలు**

గడచిన రెండేళ్లలో జరిగిన ఆపరేషన్లలో మావోయిస్టులకు జరిగిన నష్టం అపారం. భద్రతా దళాలు అందించిన నివేదికల ప్రకారం.. 2024 నుంచి ఇప్పటి వరకు 530కి పైగా మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో మరణించారు. ఇందులో అత్యధికం అగ్రశ్రేణి కమాండర్లే కావడం గమనార్హం. దేశవ్యాప్తంగా 2వేల మందికి పైగా అరెస్టు కాగా, ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకాలకు ఆకర్షితులై 2,700 మంది ఆయుధాలు వదిలేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కేవలం 350 కంటే తక్కువ మంది సాయుధ సభ్యులు మాత్రమే మిగిలి ఉన్నట్లు సమాచారం. ఒకప్పుడు పార్టీని శాసించిన సెంట్రల్ కమిటీ కూడా ఇప్పుడు కేవలం 5-6 మందికే పరిమితమైందని సమాచారం. ఇది పార్టీ ఉనికి ఎంతటి ప్రమాదంలో ఉందో స్పష్టం చేస్తోంది.

**అడవిలో పెరిగిన నిఘా.. కదలలేని స్థితిలో కేడర్**

గతంలో మావోయిస్టులకు అడవే రక్షణ కవచం. కానీ ఇప్పుడు ఆ అడవిలో కూడా వారికి రక్షణ లేకుండా పోయింది. ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్ (ఎఫ్ఓబీ) ఏర్పాటుతో భద్రతా దళాలు మావోయిస్టుల కంచుకోటల్లోకి చొచ్చుకుపోయాయి. అత్యాధునిక డ్రోన్లు, థర్మల్ ఇమేజింగ్ కెమెరాలు, ఉపగ్రహ ఛాయాచిత్రాల సాయంతో మావోయిస్టుల ప్రతి కదలికను పోలీసులు పసిగడుతున్నారు. అబూజ్‌మాడ్ వంటి ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, సెల్ టవర్ల ఏర్పాటు మావోయిస్టులకు శాపంగా మారింది. కమ్యూనికేషన్ పెరగడంతో గ్రామాల్లోని ప్రజలు మావోయిస్టులకు సమాచారం ఇవ్వడం మానేసి, ప్రభుత్వానికి సహకరిస్తున్నారు.

# ఆయుధాలు వీడాల్సిందే..: అమిత్ షా

**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

ఆయుధాలు పట్టి హింసా మార్గంలో వెళ్లేవారిని కేంద్ర ప్రభుత్వం ఎంతమాత్రం వదిలిపెట్టబోదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. లోక్‌సభలో నక్సలిజం నిర్మూలనపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగిస్తూ, నక్సలైట్లు అందరూ తక్షణమే ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా బస్తర్ ప్రాంతంలో నక్సలిజం దాదాపు అంతమైందని, అక్కడ ప్రతి గ్రామంలో పాఠశాలలను ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు. తెలంగాణలో సైతం అనేకమంది కీలక నక్సల్స్ నేతలు లొంగిపోవడం సానుకూల పరిణామమని, భారత్‌ను నక్సల్స్ రహిత దేశంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. గత 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఆదివాసీల జీవితాల్లో ఎటువంటి మార్పు రాలేదని అమిత్ షా విమర్శించారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించామని ఆయన తెలిపారు. గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పారు. నక్సలిజంపై పోరులో ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలిచారని, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భద్రతా సిబ్బందికి ఈ సందర్భంగా ఆయన ఘన నివాళులర్పించారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏజెన్సీ ప్రాంతాల్లో రూ. 4 వేల కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన వివరించారు. ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగాన్ని ధిక్కరించి ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని అమిత్ షా ప్రశ్నించారు. పాఠశాలలు, ఆసుపత్రులు, బ్యాంకులను తగులబెట్టడం ద్వారా అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ఆయన నిలదీశారు. నక్సలైట్లు వాడే ఆయుధాల్లో 52 శాతం పోలీసుల నుంచి దోచుకున్నవేనని ఆయన పేర్కొన్నారు. మావోయిస్టుల ఎజెండాలో అభివృద్ధి లేదని, వారు కేవలం తమ ఉనికి కోసమే పోరాడుతున్నారని విమర్శించారు. నక్సలైట్లను భగత్ సింగ్, బిర్సా ముండా వంటి దేశభక్తులతో పోల్చడం తగదని, ప్రజలను చంపేవారు దేశభక్తులు కాలేరని ఆయన స్పష్టం చేశారు. దేశాభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న మావోయిస్టు సిద్ధాంతాలను ప్రజలందరూ వ్యతిరేకిస్తున్నారని ఆయన ముగించారు.

# పశ్చిమాసియాలో పెరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతలు

- ఇరాన్ ప్రతిదాడులతో ఇజ్రాయెల్ లో గాయపడిన వేలాది మంది
- అమెరికాఇజ్రాయెల్ దాడులతో ఇరాన్‌లో భారీ ప్రాణనష్టం
- నేవీ చీఫ్ మృతి నేపథ్యంలో మరింత ఉత్కంఠ

**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు మరింత తీవ్రమవుతున్నాయి. ఇజ్రాయెల్ పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులకు ప్రతిగా ఇరాన్ భారీ స్థాయిలో ప్రతిదాడులకు దిగింది. ఫిబ్రవరి 28 నుంచి కొనసాగుతున్న ఈ దాడుల్లో వేలాది మంది గాయపడినట్లు అధికారిక సమాచారం చెబుతోంది. ఇజ్రాయెల్ వెల్లడించిన వివరాల ప్రకారం ఇప్పటివరకు సుమారు 6008 మంది గాయపడ్డారు. హిజ్‌బుల్లా మద్దతుతో జరిగిన దాడుల కారణంగా సాధారణ ప్రజలు తీవ్రంగా ప్రభావితమయ్యారు. నివాస ప్రాంతాలు లక్ష్యంగా మారడంతో ప్రజల్లో భయం, ఆందోళన నెలకొంది. గత 24 గంటల్లోనే 232 మందిని ఆస్పత్రుల్లో చేర్పించినట్లు ఇజ్రాయెల్ ఆరోగ్య శాఖ తెలిపింది. గత నాలుగు వారాల్లో మొత్తం 15 మంది మరణించినట్లు అంబులెన్స్ సేవలు పేర్కొన్నాయి. వైద్య సేవలపై ఒత్తిడి పెరుగుతుండటంతో అత్యవసర ఏర్పాట్లు చేపడుతున్నారు. మరోవైపు అమెరికా-ఇజ్రాయెల్ దళాల ప్రతిదాడులతో ఇరాన్‌లో భారీ ప్రాణనష్టం సంభవించింది. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్‌క్రాస్ అంచనాల ప్రకారం ఇప్పటివరకు సుమారు 1900 మంది మరణించగా, దాదాపు 20 వేల మంది గాయపడ్డారు. పరిస్థితి అక్కడ కూడా విషమంగా మారుతోంది. యుద్ధం కారణంగా ఇరాన్‌లో పలు నగరాల్లో కీలక మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. విద్యుత్, వైద్య సేవలు, రవాణా వ్యవస్థలు అంతరాయం కలిగినట్లు సమాచారం. ప్రజలు పెద్ద సంఖ్యలో సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. ఇదిలా ఉండగా, అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ నేవీ చీఫ్ అలీరెజా తంగ్‌సిరి మృతిచెందినట్లు ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ధృవీకరించింది. ఈ పరిణామంతో ఉద్రిక్తత మరింత పెరిగింది. అయినప్పటికీ తాము వెనక్కి తగ్గబోమని, హోర్ముజ్ జలసంధిలో శత్రువులకు కఠిన సమాధానం ఇస్తామని ఇరాన్ ప్రకటించింది.



# ఇంట్లోకి చొరబడి.. మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారం

- హసన్‌నగర్‌లో ఘటన
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- బాధితురాలికి వైద్య చికిత్స

**వేద న్యూస్, హైదరాబాద్, ప్రతినిధి**



నగరంలో మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హసన్‌నగర్‌లో మతిస్థిమితం లేని ఓ యువతిపై అత్యాచారం జరిగిన ఘటన కలకలం రేపింది. ఒంటరిగా ఉన్న యువతిని గమనించిన నిందితుడు ఇంట్లోకి చొరబడి ఈ దారుణానికి పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటన అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. కొంతసమయం తర్వాత ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు విషయం తెలుసుకుని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని నిందితుడిని గుర్తించారు. అదే ప్రాంతానికి చెందిన అఖిల్‌గా గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు. బాధిత యువతిని తక్షణమే ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. కుటుంబ సభ్యులకు కూడా పోలీస్ అధికారులు మద్దతు అందిస్తున్నారు. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళల భద్రతపై మరింత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు ప్రాంతంలో అదనపు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. మహిళలపై నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు.

వేద న్యూస్

మంగళవారం మార్చి 31, 2026

# ఎండిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి




- కాలువ పనులు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలి
- టీఆర్పీ నాయకుడు కొప్పుల వెంకటేష్

**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండలం ఉప్పెర మల్యాల గ్రామ పరిధిలో నీటి కొరత కారణంగా ఎండిపోయిన పంట పొలాలను తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకుడు కొప్పుల వెంకటేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. నారాయణపూర్ రిజర్వాయర్ కుడి కాలువ నిర్మాణం పూర్తికాకపోవడం వల్ల పరిసర గ్రామాల రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుకు సమీపంలో ఉన్న పొలాలు కూడా నీటి లభ్యత లేక ఎండిపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఉప్పెర మల్యాల, వెంకంపల్లి గ్రామాలకు చెందిన రైతులు మల్యాల అనిల్, మధుసుదన్ రెడ్డి, ముక్కెర పర్శరాములు తదితరుల పంటలను పరిశీలించి, వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. కుడి కాలువ పనులు ఆలస్యం కావడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని, వెంటనే పనులు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30,000 చొప్పున నష్టపరిహారం వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ముక్కెర గంగరాజు, పలుమారి సతీష్, బండ గంగరాజు, గుండవేణి నరేష్ తదితరులు మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు. ఇంకా షార్ట్ వెర్షన్ లేదా మరింత ఎమోషనల్ హెడ్డింగ్ కావాలంటే చెప్పండి

# సొంత పనులకు మున్సిపల్ సిబ్బంది

- కమిషనర్‌పై ప్రజావాణిలో బీజేపీ నేత ఫిర్యాదు
- పారిశుధ్య పనులు దెబ్బతింటున్నాయని ఆవేదన



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మున్సిపల్ కమిషనర్‌పై బీజేపీ నాయకుడు తాడూరి శివకృష్ణ తీవ్ర ఆరోపణలు చేశారు. మున్సిపల్ సిబ్బందిని స్వంత పనులకు వినియోగిస్తున్నారని పేర్కొంటూ సోమవారం ప్రజావాణిలో జిల్లా జాయింట్ కలెక్టర్ అశ్విని తనాజీకి ఫిర్యాదు సమర్పించారు. వినతిపత్రంలో, ప్రజా సేవలకు వినియోగించాల్సిన మున్సిపల్ సిబ్బందిని వ్యక్తిగత అవసరాలకు మళ్లించడం వల్ల పట్టణంలో పారిశుధ్య పనులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని తెలిపారు. పారిశుధ్య కార్మికులు, ఇతర సిబ్బందిని తరచూ వ్యక్తిగత పనులకు పంపించడం వల్ల చెత్త సేకరణ, డ్రైనేజీ శుభ్రపరిచే పనులు సక్రమంగా జరగడం లేదని పేర్కొన్నారు. సిబ్బంది కొరత కారణంగా పలు కాలనీల్లో చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజారోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా మున్సిపల్ వాహనాలు, ట్రాక్టర్లు, ఆటోలను కూడా ప్రజా పనుల కంటే ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి మున్సిపల్ కమిషనర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని, సిబ్బందిని ప్రజా సేవలకు మాత్రమే వినియోగించేలా ఆదేశాలు జారీ చేయాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు.

# రైల్వే ఉద్యోగులకు వార్షికోత్సవ బహుమతుల పంపిణీ



- సొసైటీ సభ్యులకు టిఫిన్ బాక్సులు అందజేత

**వేద న్యూస్, కాజీపేట:**

సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కాజీపేట బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం రైల్వే ఉద్యోగులకు వార్షికోత్సవ బహుమతుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షులు చిలుక స్వామి, ఉపాధ్యక్షులు ఆర్. రామ్మోహన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. కాజీపేట సొసైటీ డైరెక్టర్ డా. డి. శ్రీనివాస్ యాదవ్, నామినేటెడ్ డైరెక్టర్ దేవులపల్లి రాఘవేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సభ్యులకు నాలుగు బాక్సులతో కూడిన స్టీల్ టిఫిన్ బాక్స్, సెక్యూరిటీ బ్యాగ్‌ను బహుమతిగా అందజేశారు. కాజీపేట పరిధిలోని వివిధ రైల్వే స్టేషన్లకు చెందిన సుమారు 3వేల మంది సభ్యులకు ఈ బహుమతులను దశలవారీగా పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సొసైటీ కార్యాలయ సిబ్బంది ప్రతిరోజూ సభ్యులకు ఈ బహుమతులను అందజేస్తారని పేర్కొన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో సుమారు 41వేల మంది సభ్యులు ఉన్నారని, ఆరు డివిజన్లలోని అందరికీ బహుమతులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

# గవర్నర్‌ను కలిసిన రెడ్ క్రాస్ ప్రతినిధులు

- సేవా కార్యక్రమాలపై వివరాలు అభినందించిన గవర్నర్
- రక్తదాన కేంద్రాలు, యువ రెడ్ క్రాస్ బలోపేతంపై సూచనలు



**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు శివ ప్రతాప్ శుక్లను సోమవారం లోక్‌భవన్‌లో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్లు, రాష్ట్ర పాలకమండలి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హనుమకొండ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డా. పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు తదితరులు గవర్నర్‌కు సెవెన్ ప్రిన్సిపుల్స్ షీల్డ్, భద్రకాళి శాలువా, ప్రసాదం అందజేశారు. అలాగే హనుమకొండ రెడ్ క్రాస్ ఏజీఎం పుస్తకాన్ని అందించి, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు రెడ్ క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. జూనియర్ మరియు యూత్ రెడ్ క్రాస్ బలోపేతంపై దృష్టి పెట్టాలని, ముఖ్యంగా వేసవికాలంలో రక్తదాన కేంద్రాల్లో రక్త కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రకృతి వైపరీత్యాల సమయంలో అప్రమత్తంగా ఉండి సేవలు అందించాలని పేర్కొన్నారు. తెలంగాణ రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలు దేశంలోనే ముందంజలో నిలిచేలా తాను సహకారం అందిస్తానని గవర్నర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డా. పి. విజయచందర్ రెడ్డి, ఇ. వి. శ్రీనివాస్ రావు, కె. ప్రసాద్ రావు, మహేందర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, రమేష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నటరాజ్, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

- ప్రతి పౌరుడు సమానమే - డిప్యూటీ తహశీల్దార్ కళావతి




**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో సోమవారం పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గునుకొండ యశోద అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ తహశీల్దార్ కళావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళావతి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 ప్రకారం అంటరానితనాన్ని నిషేధించి నిర్మూలించేందుకు చట్టబద్ధ చర్యలు తీసుకున్నామని తెలిపారు. సమాజంలో ప్రతి పౌరుడు సమానుడని, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం విలువలను పాటిస్తూ అందరూ కలసి జీవించాలని పిలుపునిచ్చారు. హోటళ్లలో రెండు గ్లాసుల విధానం, దేవాలయ ప్రవేశంలో వివక్ష వంటి చర్యలు చట్టరీత్యా నేరమని హెచ్చరిస్తూ, ప్రజలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ, ఉపాధి హామీ ప్రాజెక్ట్ అధికారులు, పోలీస్ సిబ్బంది, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ సెక్రటరీతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు ప్రవీణ్, శ్రీనివాస్, సురేష్, రాజయ్య, మాజీ సర్పంచ్ కర్ర విద్యాసాగర్ రెడ్డి, గునుకొండ బాబు తదితరులు హాజరయ్యారు.

# అంగన్వాడీ చిన్నారులకు యూనిఫామ్‌ల పంపిణీ

- పౌష్టికాహారం ద్వారా పిల్లల ఆరోగ్యానికి ప్రాధాన్యం

**వేద న్యూస్, చొప్పదండి:**



మండల పరిధిలోని వెదురుగట్ట గ్రామంలోని రామలింగంపల్లి అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఉచిత యూనిఫామ్‌లను సర్పంచ్ పెంచాల శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందుతున్నదని తెలిపారు. కోడిగుడ్లు, బాలామృతం వంటి విటమిన్‌లతో కూడిన ఆహార పదార్థాలు పిల్లల ఆరోగ్య అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఏడాది నుంచి మూడు సంవత్సరాల వయస్సు గల పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మారం సమత శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు రమాదేవి, లక్ష్మీనర్సమ్మతో పాటు గర్భిణీ మహిళలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నారాయణలో కిడ్స్ పట్టభద్రుల దినోత్సవం

**వేద న్యూస్, మడికొండ:**




గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేటలో ఉన్న నారాయణ పాఠశాలలో కిడ్స్ విద్యార్థుల పట్టభద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ జోనల్ డీజీఎం రిజ్వానా ఇమ్రాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రీస్కూల్‌లో ఆటల ద్వారా నేర్చుకునే దశ నుండి క్రమబద్ధమైన విద్యావిధానంలోకి అడుగుపెట్టే సందర్భాన్ని పట్టభద్రుల వేడుకగా జరుపుకోవడం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని తెలిపారు. పిల్లలలో ప్రాథమిక విద్యా అంశాలు, సామాజిక నైపుణ్యాలు అభివృద్ధి చెందడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. అనంతరం ప్రీ స్కూల్ నుంచి ప్రాథమిక విద్యలోకి ప్రవేశిస్తున్న చిన్నారులకు క్యాప్ అండ్ గౌన్ ధరింపజేసి పట్టభద్రుల సర్టిఫికెట్లను డీజీఎం రిజ్వానా ఇమ్రాన్, ప్రిన్సిపాల్ తేజావత్ అనిత అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో జోనల్ ఈ-కిడ్స్ కోఆర్డినేటర్ శిరీష, కోఆర్డినేటర్లు ఆకుల సాయికృష్ణ, శ్యామల, ఆర్ఎస్‌టీ లఖపతి, అకడమిక్ డీన్ బండి రాకేష్, వి.పీలు మౌనిక, అనూష, ఏఓ గుంపుల చేరాలు, పీఈటీ ఘనశ్యామ్, ఆపరేటర్ హ్యారీరాజన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# లియోస్ క్లబ్ ఫౌండర్ రాకేష్ కోటకు గౌరవ డాక్టరేట్

**వేద న్యూస్, హైదరాబాద్:**




హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో అమెరికాకు చెందిన ఇంటర్నేషనల్ డేస్ప్రింగ్ థియలాజికల్ యూనివర్సిటీ 2026 సంవత్సరానికి గాను గౌరవ డాక్టరేట్ ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువ పారిశ్రామికవేత్త, లియోస్ క్లబ్ ఫౌండర్ రాకేష్ కోటకు బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ మరియు సోషల్ సర్వీస్ విభాగంలో గౌరవ డాక్టరేట్ అందజేశారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం 9 మంది ప్రముఖులకు తమ తమ రంగాల్లో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత రాకేష్ కోట మాట్లాడుతూ, ఈ గుర్తింపు రావడానికి తన వ్యక్తిత్వ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన తన తల్లి కోట విజయ కుమారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు, సినీ ప్రముఖులు పాల్గొనగా, గౌరవ అతిథిగా బాబు మోహన్ హాజరై అవార్డులను అందజేశారు.

వేద న్యూస్

మంగళవారం మార్చి 31, 2026

## కౌశిక్ రెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలి

**- వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మహేష్**



**వేద న్యూస్, చొప్పదండి:**

శాసనసభ వేదికగా సీనియర్ దళిత నాయకుడు కడి యం శ్రీహరి పట్ల హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరు అనుచితమని చొప్పదండి వ్యవ సాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కొత్తూరి మహేష్ విమర్శించారు. సోమవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... దళితుల పట్ల వివక్ష చూపే విధంగా కౌశిక్ రెడ్డి వ్యవహ రించడం సరైంది కాదన్నారు. కడియం శ్రీహరి సుదీర్ఘ రాజకీయ జీవితంలో అనేక ముఖ్య పదవులు నిర్వహించిన నాయకుడని, అలాంటి వ్యక్తిపై శాసనసభలో చేసిన వ్యాఖ్యలు తగవని పేర్కొన్నారు. దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయనకు కొత్త కాదని, గతంలోనూ ఇలాంటి సంఘట నలు జరిగాయని ఆరోపించారు. కడియం శ్రీహరి పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని బహిరం గంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కొత్తూరి మహేష్ హెచ్చరించారు.

## రంగయ్య చెరువు కాలువలు పూర్తి చేయాలి..

**- లేదంటే రైతుల తిరుగుబాటు తప్పదు**
**- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి**



**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామంలో రంగయ్య చెరువు కాలువ పనులను వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ నిరసనకు బీఆర్ఎస్ పార్టీ మద్దతు ప్రకటించగా, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హాజరై కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 32 వేల ఎకరాలకు సాగునీరు అందించే రంగయ్య చెరువు ప్రాజెక్టు పనులు సుమారు 87 శాతం పూర్తయినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు పూర్తిగా నిలిచిపోయాయని ఆరోపించారు. రెండేళ్లుగా ప్రాజెక్టుపై సరైన సమీక్ష లేకపోవడంతో వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన కాలువల నిర్మాణానికి సుమారు రూ.40 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని, వాటిని వెంటనే వినియోగించి ఎండాకాలంలోగా పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, సంబంధిత మంత్రులు ఈ సమస్యపై నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. కాలువల పనులు పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి నెలరోజుల గడువు విధిస్తున్నామని, ఆ గడువులోపు రైతులకు నీళ్లు అందించకపోతే తీవ్ర ఆందోళనలు చేపడతామని, రైతుల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్, మండల పార్టీ నాయకులు, సర్పంచులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వృద్ధుల సంక్షేమానికి ‘పరిరక్షణ బిల్లు’

**- వృద్ధ తల్లిదండ్రులకు ఆర్థిక భద్రత**
**- విశ్రాంత అధికారి సి. రామరాజు**



**వేద న్యూస్, బోయినిపల్లి:**

ఉద్యోగులు తమ వృద్ధ తల్లిదండ్రులను తప్పనిసరిగా చూసుకునేలా చేయడం లక్ష్యంగా తల్లిదండ్రుల పరిరక్షణ పర్యవేక్షణ బిల్లు-2026ను ప్రవేశపెట్టినట్లు మండల విశ్రాంత అధికారి సి. రామరాజు తెలిపారు. వృద్ధులకు ఆర్థిక భద్రతతో పాటు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ఈ బిల్లుయొక్క ప్రధాన ఉద్దేశమన్నారు. ఇప్పటికే అమలులో ఉన్న వృద్ధుల సంక్షేమ చట్టాలను మరింత బలోపేతం చేయడానికి ఈ బిల్లును రూపొందించినట్లు తెలిపారు. తల్లి దండ్రులను నిర్లక్ష్యం చేసే ఉద్యోగుల జీతం నుంచి గరిష్టంగా 15 శాతం లేదా రూ.10వేల వరకు కోత విధించి, ఆ మొత్తాన్ని నేరుగా తల్లిదండ్రుల ఖాతాలో జమ చేసే విధానం ఇందులో ఉండనుందని పేర్కొన్నారు. ఈ బిల్లు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు మరియు ప్రజాప్రతినిధులందరికీ వర్తిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, అధికారులు ఇరుపక్షాల వాదనలు విని 60 రోజుల్లో కేసును పరిష్కరిస్తారని చెప్పారు. అవసరమైతే జీతం కోత ఆదేశాలు జారీ చేస్తారని వివరించారు. అప్పీల్‌లను వృద్ధుల కమిషన్ వద్ద దాఖలు చేసుకోవచ్చని, కమిషన్‌కు విచారణ నిర్వహించే అధికారాలు ఉంటాయని తెలిపారు. సహజ, దత్తత మరియు ఆధారపడిన వృద్ధ తల్లిదండ్రులందరికీ ఈ చట్టం వర్తిస్తుందని పేర్కొన్నారు. వృద్ధుల నిర్లక్ష్యం పెరుగుతున్న నేపథ్యంలో కుటుంబ బాధ్యతను చట్టబద్ధంగా అమలు చేయడానికి ఈ బిల్లు కీలకంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## కేయూ బడ్జెట్ రూ.331.99 కోట్లు!




**- బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆచార్య బి. సురేష్ లాల్**
**- విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవంలోకి అడుగుపెట్టింది**
**- వైస్ చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి**

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కేయూ 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.331.99 కోట్ల అంచనా బడ్జెట్‌ను ప్రతిపాదించింది. సోమవారం వైస్ చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన జరిగిన 41వ అకాడమిక్ సెనెట్ సమావేశంలో ఆచార్య బి. సురేష్ లాల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తం వ్యయంగా రూ.355.90 కోట్లు అంచనా వేయగా, రూ.2.16 కోట్ల లోటు ఉండనుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో రూ.205.47 కోట్లు, ఇతర వనరుల ద్వారా రూ.126.52 కోట్లు ఆదాయం వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. వ్యయాల్లో ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లకు రూ.169.96 కోట్లు, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.97.44 కోట్లు, పరీక్షలకు రూ.54.88 కోట్లు, అకాడమిక్ కార్యక్రమాలకు రూ.13.68 కోట్లు కేటాయించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగుపెట్టిందని, జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నామని తెలిపారు. కృత్రిమ మేధస్సు, క్వాంటం టెక్నాలజీ, సాఫ్ట్ స్కిల్స్‌పై దృష్టి పెట్టి విద్యార్థులను ఉపాధికి సిద్ధం చేస్తున్నామని చెప్పారు. పరిశోధన ప్రోత్సాహానికి ప్రత్యేక అవార్డులు, చేతన కౌన్సిలింగ్ కేంద్రం, డిజిటలైజేషన్, హాస్టల్ సౌకర్యాలు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం వంటి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. బడ్జెట్‌పై పలువురు సభ్యులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ నిధుల పెంపు, నియామకాల వేగవంతం, విద్యార్థి కేంద్రిత విధానాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

## మెనూ కచ్చితంగా పాటించాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- దుమాల ఈఎంఆర్ఎస్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ**



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాల్సిందిగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య మోడల్ రెం ి డెన్షియల్ పాఠశాలలో సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపా ధ్యాయుల హాజరు రిజిస్టర్, నిల్వ గది, ఆహార పదార్థాలు, కోడి గుడ్లు, కూరగాయలు, విద్యార్థులకు సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలి ంచారు. తరగతి గదులు, వసతి గదులను కూడా పరిశీలించి పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం చికెన్, మటన్, గుడ్లు అందిస్తున్నారా అని ఆరా తీసి, ప్రభుత్వ మెనూను తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, చదువుపై శ్రద్ధ పెట్టాలని, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. తాము ఆశించిన లక్ష్యాలను సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

## సహారా డిపాజిటర్లకు వెంటనే డబ్బులు చెల్లించాలి

**- నిబంధనలు వద్దు.. నిధులు కావాలి**
**- సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్**




**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో సహారా సంస్థలో డబ్బులు పెట్టిన డిపాజిటర్లకు ఎలాంటి షరతులు లేకుండా వెంటనే చెల్లింపులు జరపాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో సహారా బాధితులతో కలిసి మండల రెవెన్యూ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ మాట్లాడుతూ.. అధిక వడ్డీ ఆశతో ప్రజలు తమ కష్టార్జిత ధనాన్ని సహారా సంస్థలో వివిధ పథకాలలో పెట్టుబడి పెట్టారని తెలిపారు. అయితే 2023 నవంబర్‌లో సంస్థ అధినేత సుబ్రత రాయ్ మరణం అనంతరం సంస్థ కార్యకలాపాలు నిలిచిపోయి, గడువు పూర్తయినా డిపాజిటర్లకు డబ్బులు తిరిగి చెల్లించలేదని విమర్శించారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు 2023 మార్చి 29న ఇచ్చిన ఆదేశాల ప్రకారం డిపాజిటర్లకు డబ్బులు చెల్లించాల్సి ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం అనవసర నిబంధనలు విధిస్తూ బాధితులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. డిపాజిటర్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ విసిగిపోయారని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఎలాంటి షరతులు లేకుండా వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గురజాల శ్రీధర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామంచ అశోక్, పార్టీ నాయకులు కుడుకల గిరిబాబు, దూస జనార్ధన్ తదితరులతో పాటు సహారా బాధితులు పాల్గొన్నారు.

## బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు




**వేద న్యూస్, చందుర్తి:**

చందుర్తి మండల పరిధిలో ఎవరైనా బెట్టింగ్‌లు నిర్వహించినా, ప్రోత్సహిం చినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జె. రమేష్ హెచ్చరించారు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. క్రికెట్ జూదం వల్ల ఆర్థిక నష్టాలు మాత్రమే కాకుండా కుటుంబాలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. మండలంలో ఎక్కడైనా బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే 100 నంబర్‌కు లేదా 87126 56420 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. యువత తప్పుడు మార్గాలకు లోనవకుండా బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని, కష్టార్జితాన్ని వృథా చేసుకోవద్దని ఎస్ఐ రమేష్ విజ్ఞప్తి చేశారు.

## ఆశాల డిమాండ్లు పరిష్కరించాలి



**- రూ.18 వేల వేతనంపై తీర్మానం చేయాలి**
**- లేకుంటే నిరవధిక సమ్మెకు సిద్ధం**
**- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీ ప్రకారం నెలకు రూ.18 వేల స్థిర వేతనం నిర్ణయించి, దీనిపై అసెంబ్లీలో తక్షణమే తీర్మానం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సిరిసిల్లలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఆశా వర్కర్లు భారీ రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోడం రమణ మాట్లాడుతూ, ఆశా వర్కర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబి స్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరిం చారు. నిర్బంధాలతో ఉద్యమాలను అణిచివేయలేరని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి జయశీల, నాయకులు సూరం పద్మ, బూర శ్రీనివాస్, ఐద్వా జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

వేద న్యూస్

మంగళవారం మార్చి 31, 2026

# మెట్టుగుట్టపై హుండీల లెక్కింపు పూర్తి

- గత ఏడాదితో పోలిస్తే ఆదాయం పెరుగుదల
- నేడు శ్రీరాముడి రథోత్సవం



**వేద న్యూస్, మడికొండ:**

వరంగల్ మహానగరంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన మెట్టుగుట్ట శ్రీ భోగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వై. రత్నాకర్ రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. శివాలయంలోని 12 హుండీల నుంచి నోట్ల రూపంలో రూ. 2,70,255, నాణేల రూపంలో రూ. 30,860 కలిపి మొత్తం రూ. 3,01,115 ఆదాయం లభించింది. అదేవిధంగా ఒక అమెరికా డాలర్, 100 డాలర్ల నోటు కూడా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా ఆర్జిత సేవలు, హుండీల ద్వారా మొత్తం రూ. 9,93,798 ఆదాయం లభించగా, గత సంవత్సరం రూ. 8,87,120 వచ్చింది. దీంతో ఈసారి రూ. 1,06,678 మేర ఆదాయం పెరిగింది. రామాలయంలోని 6 హుండీల నుంచి నోట్ల రూపంలో రూ. 62,700, నాణేల రూపంలో రూ. 11,475 కలిపి మొత్తం రూ. 74,175 లభించగా, ఒక అమెరికా డాలర్ కూడా వచ్చినట్లు వెల్లడించారు. నేడు శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా మహా పూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజావరోహణం, ఆశీర్వచనం, మంత్రపుష్పం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు వివిధ కళా బృందాల ప్రదర్శనలతో శ్రీరాముడి రథోత్సవం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లపు అర్జున్, అర్చకులు అభిలాష్ శర్మ, విష్ణువర్ధనాచార్యులు, సత్యనారాయణ శర్మ, సేవాసమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏప్రిల్ 7న ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



ఏప్రిల్ 7న ముంబైలో జరగనున్న ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లపై కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్, ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి మాదిగ తెలిపారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.ఎఫ్ కేయూ అధ్యక్షులు కుమ్మరి శ్రీనాథ్ మాదిగ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా, ముఖ్య అతిదిగా హాజరైన బొచ్చు తిరుపతి మాదిగ మాట్లాడుతూ.. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ముంబైలో జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ జాతీయ సమావేశంలో వర్గీకరణ అమలు కాని రాష్ట్రాల్లో వర్గీకరణ సాధన కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేసే దిశగా చర్చలు జరగనున్నట్లు తెలిపారు. అలాగే దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు, ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నట్లు చెప్పారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకత్వంలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ సమావేశం కీలకంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.ఎఫ్ సీనియర్ నాయకులు మంద భాస్కర్ మాదిగ, డా. వడ్డేపల్లి మధుకర్ మాదిగ, మారపల్లి రాణా ప్రతాప్ మాదిగ, అరపల్లి తిలక్ మాదిగ, రోడ్డ రాంబాబు మాదిగ, రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల దాడులు

- ట్రాక్టర్లు సీజ్.. నిందితులపై కేసులు నమోదు



**వేద న్యూస్, కరీంనగర్ రూరల్:**

మానేరు వాగు నుంచి జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై కరీంనగర్ రూరల్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి ట్రాక్టర్లను సీజ్ చేసి, నిందితులపై కేసులు నమోదు చేశారు. గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఈ అక్రమ రవాణా వెలుగులోకి వచ్చింది. మందులపల్లెకు చెందిన శివరాత్రి అభిలాష్, మొగ్ధంపూర్‌కు చెందిన దుర్గం మహేష్ ఆదేశాల మేరకు ఇసుక తరలిస్తుండగా బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. అలాగే సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన అలవేణి సంతోష్, గట్టేపల్లి గ్రామానికి చెందిన అంబాల శ్రావణ్ కుమార్ అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా బొమ్మకల్ లారీ అసోసియేషన్ చౌరస్తా వద్ద అదుపులోకి తీసుకుని వాహనాలను సీజ్ చేశారు. నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా సీఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అవసరమైతే అనుమానితులపై నిఘా పెంచుతామని తెలిపారు. సీజ్ చేసిన వాహనాలను ఎమ్మార్వోకు అప్పగించి తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- గ్రీవెన్స్ డేలో 36 ఫిర్యాదులు స్వీకరణ



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి మొత్తం 36 ఫిర్యాదులను స్వీకరించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదులను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడం, వారి సమస్యలకు వేగంగా పరిష్కారం చూపడం తమ ప్రధాన లక్ష్యమన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రీవెన్స్ డేలో స్వీకరించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కారంపై నిరంతరం సమీక్ష చేస్తూ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా త్వరిత పరిష్కారం సాధ్యమవుతుందని ఎస్పీ పేర్కొన్నారు.

# పార్టీకి జీవన్ రెడ్డి చేసిన సేవలు చెప్పాలి



- సీఎంపై విమర్శలు చేస్తే సహించేది లేదు
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం

**వేద న్యూస్, కరీంనగర్:**

జీవన్ రెడ్డి పార్టీని ఉపయోగించుకుని వ్యక్తిగత ప్రయోజనాలు పొందారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో కాంగ్రెస్ నాయకులు సముద్రాల అజయ్, గడ్డం నాగరాజుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డిని నాలుగు దశాబ్దాల పాటు ఆదరించి ఎదిగేలా చేసిందని, కానీ పార్టీకి ఆయన చేసిన సేవలు ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. జగిత్యాల నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చేసిన కృషి, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గెలిపించిన అభ్యర్థుల వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కుటుంబ ప్రయోజనాలకే పరిమితమై పనిచేశారని విమర్శించారు. బీసీ, ఎస్సీ, మైనారిటీలు, అగ్రకులాల పేదల కోసం చేసిన సేవలు ఏమిటో వివరించాలని కోరారు. కాంగ్రెస్ ద్వారా ఎదిగిన వ్యక్తి అదే పార్టీపై విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆరోపణలు చేయడం అనైతికమని అన్నారు. గతంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కలిసి పార్టీకి నష్టం కలిగించారని ఆరోపిస్తూ, భారీగా ఆస్తులు సంపాదించుకున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇకపై ముఖ్యమంత్రిపై విమర్శలు చేస్తే సహించేది లేదని గజ్జల కాంతం స్పష్టం చేశారు.

# పౌరులు హక్కులను వినియోగించుకోవాలి

- ఎస్సై లక్ష్మారెడ్డి




**వేద న్యూస్, నల్లబెల్లి:**

సమాజంలోని ప్రతి పౌరుడు తమ హక్కులను తెలుసుకుని వినియోగించుకోవాలని నల్లబెల్లి ఎస్సై లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ముచింపుల తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సమాజంలో సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీఓ రవి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రజలకు పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. నిమ్న జాతుల వారిని అవమానిస్తే చట్టపరంగా కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు. ప్రతి నెలాఖరులో గ్రామాల్లో పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని ఎంఈఓ అనురాధ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఓటర్ జాబితా ప్రక్షాళన చేపట్టాలి

- తహసీల్దార్ ప్రవీణ్ కుమార్
- బీఎల్ఓలకు శిక్షణ కార్యక్రమం




**వేద న్యూస్, శాయంపేట:**

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా శాయంపేట మండలంలోని రైతు వేదికలో బి.ఎల్.ఓలు, సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ ఆర్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ఓటర్ జాబితా ప్రక్షాళన కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. త్వరలో నిర్వహించనున్న హౌస్-టు-హౌస్ సర్వే ద్వారా బోగస్ ఓటర్లను గుర్తించి తొలగించాలని తెలిపారు. మరణించిన ఓటర్ల పేర్లను ఫారం-8 ద్వారా తొలగించడంతో పాటు, 2002 ఓటర్ జాబితాను 2025 జాబితాతో సరిపోల్చి ఎలాంటి తప్పులు లేకుండా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. బోగస్ ఓటర్లు లేని స్వచ్ఛమైన ఓటర్ జాబితా సిద్ధం చేయడమే ఎన్నికల సంఘం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారులు ఎన్. తిరుపతి, ఎం. రామయ్య, సూపర్వైజర్లు డి. రాజేష్ కన్నా, ఎం. రమేష్, బి. శైలజ, వంగేటి సత్యం, వివిధ గ్రామాల బి.ఎల్.ఓలు, జిపిఓలు పాల్గొన్నారు.

# కొత్తూరి స్వామికి జాతీయ పురస్కారం

- సామాజిక సేవా రంగంలో కృషికి గాను గౌరవం

**వేద న్యూస్, కోడిమ్యాల:**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన కొత్తూరి స్వామికి సామాజిక సేవా రంగంలో విశిష్ట కృషికి గాను 'తెలుగు వెలుగు ఉగాది మహానంది జాతీయ పురస్కారం – 2026' ప్రదానం చేశారు. గత 30 సంవత్సరాలుగా సామాజిక సేవలో కొనసాగుతున్న సేవలను గుర్తిస్తూ, మార్చి 29న ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫిలిం భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనను శాలువాతో సత్కరించి, అవార్డు మరియు ప్రశంస పత్రాన్ని అందజేశారు. తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు వెలుగు సాహితీ కార్యక్రమ నిర్వాహకులు బ్రహ్మశ్రీ తుమ్మనపల్లి పూర్ణ చంద్రాచార్యులు ఈ పురస్కారాన్ని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సలహా దారులు పొడిచెట్టి విష్ణువర్ధన్, పోలోజు రాజ్ కుమార్, వంగల శాంతికృష్ణ ఆచార్యులు, నటులు నందసదయ్య, గుంటుక రాధిక తదితరులు పాల్గొన్నారు.

# ఇంకెన్నాళ్లు అక్రమ అరెస్టులు..?

**- పోలీసులపై ఉద్యమకారుల ఆగ్రహం**



**వేద న్యూస్, శాయంపేట:**

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా పలువురు నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పొడిశెట్టి గణేష్, శాయంపేట మండల అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి రవీందర్, జిల్లా యూత్ అధ్యక్షుడు కొమ్ముల శివ, టౌన్ అధ్యక్షుడు రంగు మహేందర్, యూత్ మండల అధ్యక్షుడు ముంజాల నాగరాజు, మండల ఉపాధ్యక్షుడు ఎండి రఫీ, మండల కార్యదర్శి రాజ్ మహమ్మద్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో అక్రమ అరెస్టులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులకు తగిన గౌరవం ఇవ్వడం లేదని విమర్శించారు. ఉద్యమకారులకు గౌరవ వేతనం, స్థలాలు వంటి హామీలు ఇచ్చినప్పటికీ అవి అమలు కాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా, ఇచ్చిన హామీలను అమలు చేయలేదని అన్నారు. ప్రభుత్వం ఉద్యమకారులను అరెస్టులు చేస్తూ ఒత్తిడి తీసుకొస్తోందని విమర్శిస్తూ, ప్రజల సమస్యలను పరిష్కరించేలా పాలన సాగించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ప్రజలు తగిన సమాధానం ఇస్తారని హెచ్చరించారు.

# డైరీ దొంగిలింపు ఆరోపణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**వేద న్యూస్, సిద్దిపేట:**

వేములవాడకు చెందిన వెల్దండి సదానందం తన మైనర్ కుమార్తె హరిణిపై తప్పుడు ఆరోపణలు చేసి, వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీశారని ఆరోపిస్తూ సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, 2022లో హుస్నాబాద్ మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న సమయంలో హరిణి ప్రిన్సిపాల్ శ్రీదేవి నిర్లక్ష్యంపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీనిపై అధికారులు విచారణ చేపట్టి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ ఘటనను మనసులో పెట్టుకున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి, హరిణిపై ద్వేషపూరితంగా వ్యవహరిస్తూ ఆమె వ్యక్తిగత డైరీని దొంగిలించి, అందులోని విషయాలను వక్రీకరించి తప్పుడు ఆరోపణలు సృష్టించిందని సదానందం ఆరోపించారు. అదేవిధంగా, అసత్య ఆరోపణలతో బాలిక పరువును దెబ్బతీశారని పేర్కొన్నారు. ఈ విషయానికి సంబంధించిన ఆడియో ఆధారాలను కూడా కలెక్టర్‌కు సమర్పించినట్లు తెలిపారు. మైనర్ బాలిక గౌరవాన్ని దెబ్బతీసిన ప్రిన్సిపాల్‌పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

# రెండు లారీలు ఢీ..

**- ట్రాఫిక్‌కు అంతరాయం**



**వేద న్యూస్, శంకరపట్నం:**

శంకరపట్నం మండలంలోని మొలంగూర్ గ్రామంలో సోమవారం రెండు ఇసుక లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రమాదం కారణంగా రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడి, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి పెద్దగా గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# కాళేశ్వరాలయ చైర్మన్ గా మోహన్ శర్మ



**వేద న్యూస్, మహాదేవపూర్:**

దక్షిణ కాశిగా పేరుఘంచిన శ్రీ కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గా మోహన్ శర్మను నియమించినట్టు మంథని పట్టణానికి చెందిన మోహన్ శర్మ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాళేశ్వరం ఆలయ కమిటీ చైర్మన్ గా పనిచేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన అతన్ని సరస్వతి పుష్కరాల సమయంలో దేవాలయ కమిటీ తాత్కాలిక కమిటీ చైర్మన్ గా పనిచేశారు. ప్రస్తుతం ఆలయ కమిటీ సభ్యులు నియమించడంతో సభ్యుల ప్రమాణ స్వీకారం రోజు మోహన్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

# తై బజార్, మస్లక్ వేలం పాట



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ అధ్యక్షతన సోమవారం తై బజార్, పశు వధశాల (మస్లక్) వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో రుద్రూర్ గ్రామానికి చెందిన గాండ్ల శ్రీనివాస్ 4 లక్షల 26 వేల రూపాయలకు తై బజార్ ను దక్కించుకున్నారు. అలాగే ఎండి. గోరెమియా 1 లక్ష 22 వేల 500 రూపాయలకు పశువదశాల (మస్లక్) ను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ప్రేమ్ దాస్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఓ వైపు కోతులు.. మరోవైపు కుక్కలు!

- భయాందోళనలో ప్రజలు
- వానరాలను తరమబోయి ఇటీవల ఓ వ్యక్తి మృతి
- చర్యలు తీసుకోవాలని ప్రజల వేడుకోలు





**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిశీలిస్తే, మొదటగా కోతులు, కుక్కల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులే ప్రస్తావనకు వస్తున్నాయి. కోతుల సమస్య కారణంగా పత్తిపాక గ్రామంలో ఓ వ్యక్తి మృతి చెందగా, కుటుంబ సభ్యులు అనాధలుగా మిగిలిపోయారు. దీనికి గల కారణాలపై అధికారులు ఆత్మపరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కాలంగా కోతులు, కుక్కల బెడద పెరుగుతోంది. వీధుల్లో వృద్ధులు, చిన్నపిల్లలు నడవడం కష్టసాధ్యమవుతోంది. ఎటువైపు నుంచి ఏ జంతువు దాడి చేస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ రెండు జంతువుల వల్ల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వీధుల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ పలువురిపై దాడులు చేసి గాయపరిచిన ఘటనలు చోటుచేసుకున్నాయి. మరోవైపు ఇళ్లపై, చెట్లపై తిరిగే కోతులు పిల్లలు, మహిళలు, ఇంటి యజమానులపై దాడి చేసే ఘటనలు తరచుగా జరుగుతున్నాయి.

**కోతుల దాడిలో వ్యక్తి మృతి..**

ఇటీవల కోతుల దాడి వల్ల మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులు అనాధలుగా మిగిలిపోయారు. పత్తిపాక గ్రామ ప్రజలు కోతులు, కుక్కల సమస్యపై వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇళ్లలోకి చొరబడుతున్న కోతులు ప్రజల్లో భయాన్ని కలిగిస్తున్నాయి. రోజురోజుకు బయటకు వెళ్లడానికే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కోతులు వెంబడిస్తాయో, కుక్కలు దాడి చేస్తాయో తెలియడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రజల ఇబ్బందులను అధికారులు గమనించి కోతులు, కుక్కలను అరణ్య ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటే ప్రజలకు భరోసా కలిగినట్టవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# లబ్ధిదారులకు కార్పొరేషన్ లోన్ లను పంపిణి చెయ్యాలి



**- కలెక్టర్ రాహుల్ శర్మని కోరిన సర్పంచ్ గుర్సింగ బాపు**

**వేద న్యూస్, మహాదేవపూర్ :**

మహాదేవపూర్ మండలం చంద్రుపల్లి గ్రామపంచాయతీకి 2024 వ సంవత్సరంలో పీఎం అజయ్ పథకంలో భాగంగా 100 యూనిట్లు ఎస్సి కార్పొరేషన్ లోన్ లు మంజూరు కాగా లబ్ధిదారుల ఖాతాలో సబ్సిడీ అమౌంట్ క్రెడిట్ అయ్యింది ఈ లోన్ లని కొంతమంది లబ్ధిదారులకు మాత్రమే ఎస్సి కార్పొరేషన్ ఈడీ అధికారి పంపిణి చేశారు. విషయం గురించి ఇటీవల మంత్రి తెలుపగ మంత్రి శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ లోన్ లు పంపిణి చేసి సమస్య పరిస్కారం చెయ్యాలని తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పీఎం అజయ్ పథకంలో లబ్ధిదారులలందరికి లోన్ లు పంపిణి చెయ్యాలని ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్ శర్మ కోరిన చంద్రుపల్లి సర్పంచ్ గుర్సింగ బాపు కలెక్టర్ గాసానుకూలంగా స్పందించి ఎస్సి కార్పొరేషన్ ఈడీ ని ఈ సమస్యని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్, యూత్ కాంగ్రెస్ నాయకులు కొండగొర్ల సంతోష్ పాల్గొన్నారు.

# ఉదండాపూర్ నిర్వాసితులకు మరో రూ.150 కోట్లు





**- ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ప్రభుత్వం చర్యలు**

**- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

**వేద న్యూస్, జడ్చర్ల:**

ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ప్రభుత్వం మరో రూ.150 కోట్లు విడుదల చేసినట్లు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. దీంతో ఇప్పటివరకు విడుదలైన మొత్తం రూ.400 కోట్లకు చేరిందన్నారు. నిర్వాసితులకు చెల్లించాల్సిన మిగిలిన బకాయిలను కూడా త్వరలో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పరిహారాన్ని రూ.18 లక్షలకు పెంచిన నేపథ్యంలో అదనంగా నిధులు విడుదల చేయాల్సి ఉన్నదని తెలిపారు. రెండు నెలల్లోపుగా బకాయిలు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. అలాగే మిగిలిన మొత్తాన్ని కూడా ఏప్రిల్ నెలలో తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. నిధుల విడుదలకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి భట్టి విక్రమార్కలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. అలాగే నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్లను త్వరగా రిజిస్టర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు.

# సమాజ అభివృద్ధికి యువత ముందంజలో ఉండాలి

**- కాళేశ్వరం సర్పంచ్ మోహన్ రెడ్డి**





**వేద న్యూస్, మహాదేవపూర్ :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామపంచాయతీ పరిధిలో గత వారం రోజులు గా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సామాజిక కార్యక్రమాలు ప్రోగ్రాం అధికారిని డాక్టర్ ఇ మాధవి ఆధ్వర్యంలో (ఎన్ఎస్ఎస్) ముగింపు కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ వేడుకకు కళాశాల ప్రిన్సిపల్ జన్ను విజయకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కాళేశ్వర గ్రామ సర్పంచ్ వెన్నపు రెడ్డి మోహన్ రెడ్డి హాజరై విద్యార్థి దశ నుండే సమాజంపై సామాజిక పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలని ప్రతి విషయాన్ని సమాజంలో జరుగుతున్నటువంటి అనేక విషయాలపై సరైన అవగాహన కలిగి సమస్యను తెలుసుకుని దానిని నివారించడానికి ప్రయత్నం చేయాలని మానవసేవయే మాధవ సేవ అనే సూక్తిని వారు విద్యార్థులకు గుర్తు చేశారు వాలంటీర్ల సేవాభావాన్ని ప్రశంసించారు. విశిష్ట అతిథిగా యూనియన్ బ్యాంక్ మేనేజర్ పవన్ పాల్గొని, యువత సమాజ అభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషించాల్సిన అవసరాన్ని వివరించారు ఉప సర్పంచ్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ ఎటువంటి సమస్యనైనా అలవోకగా పరిష్కరించే శక్తి సామర్థ్యం యువతలో మెండుగా ఉంటుందని యువత దానిని గ్రహించి అభివృద్ధి వైపు బాటలు వేయాలని తెలిపారు.

వేద న్యూస్

మంగళవారం మార్చి 31, 2026

## ఉత్తమ యోగా మాస్టర్ సతీష్ గౌడ్ కు నంది అవార్డు



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ గ్రామానికి చెందిన యోగా మాస్టర్ సతీష్ గౌడ్ నంది అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ లోని ఎఫ్టిసిసిఐ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో రితిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ యోగా మాస్టర్ సతీష్ గౌడ్ ఆదివారం బెస్ట్ నంది అవార్డు అందుకున్నారు. నంది అవార్డు రావడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## ఏప్రిల్ 2 న గ్రామసభలు నిర్వహించాలి



**వేద న్యూస్, పోతంగల్ :**

ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2 న నిర్వహించే గ్రామసభలు విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి ఆర్డబ్ల్యూఎస్ డిఈ మున్నీ నాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల, గ్రామ స్థాయి అధికారులతో ముఖ్య సమావేశం అయి మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామంలో గ్రామ సభను తప్పనిసరిగా నిర్వహించాలనీ అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాభివృద్ధి ప్రణాళికలు, మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించాలన్నారు. గ్రామస్థుల నుండి సలహాలు, సూచనలు, ఫిర్యాదులను సేకరించి నివేదించాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులున్నారు.

# పౌర హక్కులపై అవగాహన



**వేద న్యూస్, రుద్రూర్ :**

పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రుద్రూర్ మండల కేంద్రంలోని చిక్కడపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం పౌర హక్కుల పై అంగన్వాడి టీచర్లకు, గ్రామస్తులకు తహశీల్దార్ తారాబాయి, ఎంపీడిఓ బాల గంగాధర్ లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షెడ్యూల్డు కులాల, తెగల అత్యాచార నిరోధక చట్టం 1989 ప్రకారం అత్యాచారాలకు పాల్పడిన లేదా ప్రోత్సహించిన వారిపై చట్ట రిత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు. షెడ్యూల్డు కులములు, షెడ్యూల్డు తెగులకు చెందిన లేదా కేటాయించిన భూములను అక్రమంగా ఆక్రమించినా, సాగుచేసిన వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయన్నారు. అంటరానితనం అమానుషమని, అంటరానితనాన్ని పాటించిన వారు శిక్షించబడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మచ్కురి రమేష్, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ టీచర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## న్యూమోనియా వ్యాధితో బాధపడుతున్న యువకుడు

- డాక్టర్లను సంప్రదిస్తే చికిత్స కోసం రూ.10 లక్షలు అవసరం
- సహాయం కోసం ఎదురుచూపులు



**వేద న్యూస్,నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు గ్రామానికి చెందిన ఊదరి రాజశేఖర్ కు చిన్న వయసులోనే జీవనశైలిలో న్యూమోనియా వ్యాధితో ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఊదరి రాజశేఖర్ కు చిన్నతనంలోనే తల్లిదండ్రులు కోల్పోయారు.ఇప్పుడు ఆయనకు చిన్న వయసులోనే న్యూమోనియా జబ్బు రావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రస్తుతం రాజశేఖర్ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నగరంలోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రాజశేఖర్ మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు డాక్టర్లను సంప్రదించగా రూ.10 లక్షల అవసరమని చెప్పారు. దీంతో తల్లిదండ్రులు లేని అనాధ రాజేశేఖరకు అంత డబ్బు ఎక్కడి నుంచి తీసుకురావాలో పాలు పోకపోవడంతో స్నేహితులు, బంధుమిత్రులు దాతల సహకారంతో కొంత డబ్బును ఆస్పత్రికి అందించారు. ఇంకా అతనికి కొంత డబ్బు అవసరం ఉండడంతో కుటుంబ సభ్యులు దాతల సహకారం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ స్వచ్ఛంద సంస్థలు, మానవత్వవాదులు, యువకులు తన తోచిన విధంగా సహాయం చేసి ప్రాణాలు కాపాడాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సహాయం గూగుల్ పే, ఫోన్ పే ద్వారా నేరుగా 9010290930, 9542206194 పంపగలరని విజ్ఞప్తి చేశారు.

# రూ.107.30 కోట్ల అంచనా బడ్జెట్‌కు ఆమోదం

- అభివృద్ధికి అందరూ సహకరించాలి
- ఆదాయ వనరుల పెంపుతో పట్టణాభివృద్ధి సాధ్యం
  చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి



**వేద న్యూస్, సూర్యపేట :**

సూర్యాపేట మున్సిపాలిటీ 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.107.30 కోట్ల అంచనా బడ్జెట్‌ను రూపొందించి ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి తెలిపారు. నూతన పాలక మండలి ఏర్పడిన తరువాత తొలి సమావేశంగా 2025-26 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్ ,2026-27 ముసాయిదా బడ్జెట్ సమావేశాన్ని సోమవారం స్థానిక రవి మహల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన రూ.107.30 కోట్ల బడ్జెట్‌కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం ఆదాయ వనరులను పెంపొందించడంతో పాటు ప్రజలు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను విస్తరించడం ద్వారానే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఇంటి పన్నుల ద్వారా రూ.1775 లక్షలు, స్టాంపు డ్యూటీ ద్వారా రూ.600 లక్షలు, నాన్-ట్యాక్స్ ఆదాయం (అద్దెలు) ద్వారా రూ.204.50 లక్షలు, పరిశుభ్రత విభాగం ద్వారా రూ.111.50 లక్షలు, పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా రూ.1568.50 లక్షలు, ఇంజినీరింగ్ విభాగం ద్వారా రూ.330.50 లక్షలు ఆదాయం రానుందని వివరించారు.అదనంగా డిపాజిట్లు, రుణాల రూపంలో రూ.110 కోట్లు, నాన్-ప్లాన్ నిధులు రూ.620 లక్షలు, ప్లాన్ నిధులు రూ.5170 లక్షలు, ఇతర నిధులు రూ.240 లక్షలు కలిపి మొత్తం రూ.10730 లక్షల బడ్జెట్ రూపొందించామని తెలిపారు.ఖర్చుల కేటాయింపుల విషయానికి వస్తే సిబ్బంది వేతనాలకు రూ.1420 లక్షలు,పారిశుద్ధ్య నిర్వహణకు రూ.522 లక్షలు, విద్యుత్ చార్జీలకు రూ.344 లక్షలు, రుణాల చెల్లింపులకు రూ.406 లక్షలు, గ్రీన్ బడ్జెట్‌కు రూ.459 లక్షలు, ఇంజినీరింగ్ విభాగ నిర్వహణకు రూ.445 లక్షలు, సాధారణ పరిపాలనకు రూ.219.20 లక్షలు కేటాయించినట్లు చెప్పారు.అదేవిధంగా పట్టణ ప్రణాళిక విభాగం ఖర్చు కు రూ 7.50 లక్షలు, ప్రజా సౌకర్యాల కోసం రూ.65.73 లక్షలు, అభివృద్ధి పనులకు రూ.445.80 లక్షలు, 1/3 బ్యాలెన్స్ బడ్జెట్‌గా రూ.255.77 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు.ఇక డిపాజిట్లు, రుణాలు చెల్లింపు లకు 110 లక్షలు కేటాయింపు జరిగిందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రానున్న నాన్-ప్లాన్ గ్రాంట్ కింద రూ.620 లక్షలు, ప్లాన్ గ్రాంట్ కింద రూ.2460 లక్షలు, ఇతర నిధుల కింద అభివృద్ధి పనులకు రూ.2950 లక్షలతో మొత్తంగా 10730 లక్షలు కేటాయించడం జరిగిందని ఆమె వివరించారు. మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం ఎక్కువగా సిబ్బంది జీతాలు, విద్యుత్ బిల్లులు, పరిశుభ్రత, నీటి సరఫరా, పండుగలు మరియు ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు ఖర్చువుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అదనపు ఆదాయ వనరులను గుర్తించడం అత్యవసరమని సూచించారు.పట్టణాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ఇంటి పన్నులు, నీటి బిల్లులు సమయానికి చెల్లించడం ద్వారా మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. అక్రమ నిర్మాణాలను నియంత్రించడం, మున్సిపాలిటీ ఆస్తులను పరిరక్షించడం ద్వారా కూడా ఆదాయం పెంచుకోవచ్చని తెలిపారు.అనంతరం జరిగిన సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు తమ వార్డుల సమస్యలను చైర్‌పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎం.డి. షఫీ ఉల్లా, మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. హన్మంతరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాళేశ్వరం ఆలయ కమిటీ ఎన్నిక



**వేద న్యూస్, మహాదేవపూర్ :**

దక్షిణ కాశిగా పేరు ఘాంచిన పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ కమిటీని నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం దేవాలయ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది నుంచి కాళేశ్వర ముక్తేశ్వర ఆలయానికి కమిటీ లేకపోవడంతో దేవాదాయ శాఖ అధికారులే కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చే మే నెలలో సరస్వతి అంత్య పుష్కరాలతో పాటు 2027 సంవత్సరంలో గోదావరి పుష్కరాలు ఉండడంతో కమిటీ నియమించారు. గతంలో కాళేశ్వరం ముక్తేశ్వర ఆలయ కమిటీ సంవత్సరం కాలం పట్టే పదవీకాలం ఉండేది. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీ కాలపరిమితి రెండు సంవత్సరాలుగా నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ సభ్యులుగా అవదాని మోహన్ శర్మ,కుంభం పద్మ అడ్డూరి శ్రీధర్ రావు బీసుల నర్సయ్య గంధసిరి సత్యనారాయణ, మంచినీళ్ల దుర్గయ్య, దొడ్ల అశోక్, సుంకరి సీతారాం, జే సీతారాం, కే సత్తయ్య, శ్యామసుందర్లను కమిటీ సభ్యులుగా నియమించారు.

## అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీఓ



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండలంలోని రాయకూర్ గ్రామంలో గల ఇందిరా నగర్ అంగన్వాడి కేంద్రాన్ని సోమవారం ఎంపిఓ అరవింద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల హాజరు పట్టికను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రానికి సరఫరా అయ్యే పాలు, గుడ్లు తదితర సరుకుల వివరాల గురించి అంగన్వాడీ టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. ఆయన సూపర్వైజర్ శ్రీలత, అంగన్వాడీ టీచర్ రత్న కుమారి తదితరులు ఉన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణమే కృషి

- ఎస్పీ కే నరసింహ



**వేద న్యూస్,సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**

ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ కే నరసింహ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ఆయన మాటాడారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదు దారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి సంబంధించిన అధికారులకు తక్షణమే ఆదేశించారు.ప్రజల సమస్యలపై సత్వరమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధితులకు భరోసా కల్పించాలని కోరారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా పైరవీలు లేకుండా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టం ఎవరికి చుట్టం కాదని చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు.

## బాధితుల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్



**వేద న్యూస్,నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

బాధితుల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధించిన అధికారులకు ఆదేశించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి 45 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. అందులో వ్యక్తిగత కుటుంబాలు, ఆర్థిక మోసాలు,ఇతర సామాజిక సమస్యలు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ప్రతి ఫిర్యాదును విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించడం పోలీసుల ప్రధాన కర్తవ్యం మని పేర్కొన్నారు. పోలీసులంటే ప్రజలపై విశ్వాసం పెరగాలని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.

## రూ.5 లక్షలతో సిసి రోడ్ నిర్మాణం

- సర్పంచ్ పిల్లల సందీప్



**వేద న్యూస్,నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు గ్రామంలో సిసి రోడ్ నిర్మాణం పనులను సర్పంచ్ పిల్లల సందీప్ ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సహకారంతో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా 5 లక్షల రూపాయలతో సిసి రోడ్ నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్లు లేని కాలనీలను గుర్తించి దశల వారిగా సిసి రోడ్లు నిర్మిస్తామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గ్రామీణ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ...అంతర్గత రోడ్ల నిర్మాణానికి భారీ నిధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యం అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాలెం రాజు, రాష్ట్ర ఐఎన్టియుసి ఆర్గనైజింగ్ కార్యదర్శి బంటు చొక్కాయ్య గౌడ్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి పత్తిపాటి స్వరాజ్యలక్ష్మి, వార్డు సభ్యులు దండం శ్రీను, మాతంగి సైదులు, పెరమండ్ల రమణ నాయకులు కోల పెద్ద సైదులు, వాకిటి బిక్షం, కొడిదల శంకర్, పెరుమాండ్ల కవిరాజు, బచ్చు జానయ్య,మెరుగు అరుణ్, మున్న గోపాల్,పేర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం మార్చి 31, 2026

## సమాజ మార్పు కోసం విద్యార్థులు కృషి చేయాలి



**- డాక్టర్ గోలి శ్రీలత**

**వేద న్యూస్, హన్మకొండ :**

జాతీయ సేవా పథకం కార్యకర్తలంతా సామాజిక సేవే పరమావధిగా పని చేయాలని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల వరంగల్ వెస్ట్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోలి శ్రీలత అన్నారు. న్యూ శాయంపేట పరిధిలోని జిపిఎస్ పోచంపల్లిలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇనుగాల రాధికతో కలిసి ప్రిన్సిపాల్ డాక్టర్ గోలి శ్రీలత మాట్లాడారు. సామాజిక సేవతోనే పరిపూర్ణ పౌరులుగా ఎదుగుతారని సమాజ మార్పు కోసం విద్యార్థులు కృషి చేయాలని కోరారు విద్యతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం ఆహ్వానించదగిందన్నారు. జిపిఎస్ హెచ్ ఉప్పలయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సేవాభావాన్ని అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోనీ,శ్రీ విద్యా, పూజ శ్రీ సౌమ్యశ్రీ,త్రివేణి,పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

**- ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించిన సీపీఎం నాయకులు**

**వేద న్యూస్,కారేపల్లి:**

సింగరేణి మండలంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఐటిడిఎ, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ..గతంలో గ్రామసభల ద్వారా ఇందిరమ్మ కమిటీ ఎంపిక చేసిన లబ్ధిదారుల పేర్లను కొత్త పాలకవర్గం తొలగించకూడదని కోరారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 లబ్ధిదారుల జాబితాల్లో రాజకీయ ప్రభావం, ఆర్థిక లావాదేవీల కోసం మార్పులు చేయడం సరికాదని స్పష్టం చేశారు. అలాగే లబ్ధిదారుల నుండి రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు జరుగుతున్న బలవంతపు వసూళ్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పేదల వద్ద నుంచి డబ్బులు వసూలు చేయడం




అన్యాయమని, అర్హతే ప్రధాన ప్రమాణంగా ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రావాల్సిన రూ.60 వేల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపత్రం సమర్పణలో సీపీఎం మండల కార్యదర్శి కె. నరేంద్ర, నాయకులు వజ్జా రామారావు, తలారి దేవప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ గుడికి స్థలదానం



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

**-60 గజాల స్థలాన్ని విరాళంగా ఇచ్చిన తుళ్లూరి దంపతులు**
**-విరాళం విలువ రూ. 6 లక్షలు.. దాతలకు ఘన సన్మానం**

ఖమ్మం నగరం ఒకటో డివిజన్ కైకొండాయిగూడెంలోని ముత్యాలమ్మ దేవాలయ విస్తరణకు అదే డివిజన్ లో నివాసం ఉంటున్న తుళ్లూరి మాధవరావు - కోటేశ్వరి దంపతులు విరాళం అందించారు. ఆలయ అభివృద్ధి కోసం తమవంతుగా సుమారు రూ. 6 లక్షలు విలువ చేసే 60 గజాల తమ స్థలాన్ని ఆలయానికి విరాళంగా ఇస్తున్నట్లు స్థల పత్రాలను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందచేసి తమ ఉదారతను చాటుకున్నారు.

**తుళ్ళూరి దంపతులకు అభినందన**

ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు నాగటి ఉపేందర్ మాట్లాడుతూ.. ఆలయ విస్తరణకు తమ వంతు సహాయంగా స్థలాన్ని దానం చేసిన మాధవరావు దంపతులను అభినందించారు. భక్తుల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతలను గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దిని ప్రసాద్, ఆళ్ల రమేష్, గద్దల చిన్నప్ప, తుళ్లూరి కృష్ణయ్య, నాగటి శ్రీనివాసరావు, శీలం వీరబాబు, గిరిశాల రామారావు, పందుల తిరుపతిరావు, భూక్యా ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యమూర్తికి ఘన సన్మానం

**వేద న్యూస్,ఖమ్మం ప్రతినిధి:**



అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తిని మహేష్ బాబు అభిమానులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గుగ్గిళ్ళ దివ్యమూర్తి ప్రతిభను చూసి ఈ సన్మానం చేస్తున్నట్లు కందుల మహేష్, వంగూరి సూర్య తెలియజేశారు. ఈ సన్మానం జరగడం తనకు సంతోషంగా ఉందని దివ్య మూర్తి తెలియజేశారు. ఇప్పటివరకు 130 వేదికల మీద సన్మానం జరిగిందని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమం లో జాతీయ సామాజిక సేవా అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు, అజయ్ తండ మాజీ సర్పంచ్ బానోతు శంకర్ నాయక్, మాల మహానాడు సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కందుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు పక్కాగా నిర్వహణకు అవసరమైన చర్యలు

**వేద న్యూస్,ఖమ్మం ప్రతినిధి:**

యాసంగి (రబీ) 2025-26 ధాన్యం కొనుగోలు పక్కాగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన యాసంగి (రబీ) 2025-26 సీజన్ ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రస్తుత యాసంగి సీజన్ నుంచి ధాన్యం కొనుగోలు వివరాలతో పాటు రైతులకు జరిగే చెల్లింపులను కూడా రెగ్యులర్ గా మానిటర్ చేయడం జరుగుతుందని, రైతులకు చెల్లింపు జరిగినప్పుడే మన బాధ్యత పూర్తవుతుందని అన్నారు. ఐకేపి ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులకు చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని, దీనిని ఇంప్రూవ్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైస్ మిల్లులకు వెంటనే తరలించి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని అన్నారు. ఐకేపి నిర్వాహకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ప్రత్యేకంగా రివ్యూ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గన్ని బ్యాగులు మిల్లర్ల నుంచి పూర్తి స్థాయిలో సేకరించాలని కలెక్టర్ అన్నారు. ధాన్యం రవాణా వాహనాలు సరిగ్గా ఉండేలా చూడాలని, ప్రతి వాహనానికి జిపిఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. అకాల వర్షాల వల్ల పంట నష్టం కాకుండా కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లను అందుబాటులో పెట్టుకోవాలని అ న్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసర మైన తేమ యం త్రాలు, ఇతర ఇన్ ఫ్రా అందు బాటులో ఉందో లేదో క్రాస్ చెక్ చేసుకో వాలని కలెక్టర్ సూచించారు. రైస్ మిల్లర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేరా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టాలని అన్నారు. గత అనుభవాలు దృష్టిలో ఉంచుకుని ఇబ్బందికరమైన కేంద్రాలలో ఎటువంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రాబోయే వారం రోజులలో పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు.



# పాడె మోసిన వార్డు సభ్యుడు

**వేద న్యూస్, కారేపల్లి:**



కష్ట కాలంలో ప్రజల వెన్నంటి ఉండటమే అసలైన సేవ అని నిరూపించారు ధారావత్ రమేష్ నాయక్. మండల పరిధిలోని ఉసిరి కాయలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల గొల్లగూడెం గ్రామానికి చెందిన వాంకుడోత్ చందా (90) మరణం ఆ గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ కష్ట సమయంలో స్థానిక వార్డు సభ్యులు చూపిన చొరవ అందరినీ ఆలోచింపజేస్తోంది. కుటుంబ సభ్యుడిలా మారి.. 90 ఏళ్ల నిండు నూరేళ్ల జీవితాన్ని గడిపి తుదిశ్వాస విడిచిన చందా పార్థివ దేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించే సమయంలో, 9వ వార్డు సభ్యులు ధారావత్ రమేష్ నాయక్ స్వయంగా ముందుకు వచ్చారు. పాడె మోసి తన మానవత్వాన్ని చాటుకున్నారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం



**వేద న్యూస్ కారేపల్లి:**

మండలంలోని గాదెపాడు గ్రామపంచాయతీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో మంజూరైన నిధులతో గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ. 8 లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు సిసి రోడ్లకు గాదెపాడు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంతర్గత రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులు కేటాయించడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతతో కూడిన పనులు త్వరగా పూర్తి చేసి, ప్రజలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యమని ఈ సందర్భంగా సర్పంచ్ రంజిత్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలతో పాటు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభివృద్ధి పనుల పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మృత్యుపాశాలుగా గుంతలు!

**- ఉసిరికాయలపల్లిలో..**
**- ప్రాణనష్టం జరిగితే ఎవరిది బాధ్యత?**




**వేద న్యూస్ , కారేపల్లి:**

సింగరేణి మండల పరిధిలోని ఉసిరి కాయలపల్లి గ్రామ పంచాయతీలో అభివృద్ధి మాట దేవుడెరుగు కానీ, కనీస రహదారి సౌకర్యం లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని బండారి కోటమ్మ ఇంటి ముందు ఏళ్ల తరబడి గా ఉంటున్న భారీ గుంతలు ఇప్పుడు గ్రామస్థుల పాలిట మృత్యుపాశాలుగా మారాయి. ఈ రోడ్డు దుస్థితిపై స్థానికులు, ప్రజాప్రతినిధులు ఎంత మొత్తుకున్నా అధికారుల చెవులకు ఎక్కడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా 3వ వార్డు సభ్యురాలు బర్మవత్ పార్వతి, 9వ వార్డు సభ్యులు ధారావత్ రమేష్ నాయక్ ఈ సమస్యపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. తమ వార్డుల్లోని సమస్యలను పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా, ఫలితం శూన్యమని వారు వాపోతున్నారు. ఈ మార్గంలో వెళ్తున్న ఒక కారు అదుపు తప్పి గుంతలో దిగబడిపోయింది. గంటల తరబడి శ్రమించి కారును బయటకు తీయాల్సి వచ్చింది. కేవలం వాహనాలే కాకుండా, ఒక లేగదూడ కూడా ఈ బురద గుంతల్లో దిగబడి ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. స్థానికులు గమనించి కాపాడటంతో ప్రమాదం తప్పింది. ఈ గుంతల తీవ్రత కారణంగా రాత్రి సమయంలో ఈ రోడ్డుపై నడవాలంటేనే వృద్ధులు, చిన్నారులు వణికిపోతున్నారు. "రాత్రి వేళల్లో ఎవరైనా అప్రమత్తంగా లేక ఈ గుంతల్లో పడితే కాళ్లు, చేతులు విరగడం ఖాయం. ఒకవేళ మద్యం మత్తులో ఉన్నవారు పడితే ప్రాణాపాయం కూడా సంభవించవచ్చు" అని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రాణనష్టం జరిగాక స్పందించడం కంటే, ముందుగానే మేల్కొని ఈ గుంతలను పూడ్చి రోడ్డును మరమ్మతు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని, ఉసిరికాయలపల్లి గ్రామ ప్రజల ఇబ్బందులను తొలగించాలని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.

## ప్రజా సేవలో సర్పంచ్

**- గ్రామస్తులకు బానోత్ పద్మ రుప్లా నాయక్ చక్కటి సేవలు**

**వేద న్యూస్, కారేపల్లి:**



పదవి అంటే అధికారం కాదు, ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం అని నిరూపిస్తున్నారు చిన్నమడం పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ బానోత్ పద్మ రుప్లా నాయక్. నిరంతరం ప్రజా సంక్షేమం, గ్రామాభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న ఆమె, సోమవారం గ్రామంలో మరో కీలక అడుగు వేశారు. గ్రామంలోని ప్రధాన వీధులతో పాటు అంతర్గత రహదారులపై ఉన్న విద్యుత్ స్తంభాలకు కొత్త ఎల్ఈడి లైట్లను అమర్చే కార్యక్రమాన్ని సర్పంచ్ పద్మ స్వయంగా పర్యవేక్షించారు. గత కొంతకాలంగా లైట్లు లేక ఇబ్బంది పడుతున్న కాలనీల ప్రజల విన్నపాలకు తక్షణమే స్పందించి, యుద్ధ ప్రాతిపదికన ఈ పనులను పూర్తి చేయించారు. అధికారులు, సిబ్బందితో కలిసి సర్పంచ్ స్వయంగా వీధుల్లో తిరుగుతూ ప్రతి స్తంభానికి వెలుగు ఉండేలా చర్యలు తీసుకున్నారు. రాత్రి సమయాల్లో చీకటి భయం లేకుండా, వెలుగులు నింపినందుకు గ్రామస్థులు సర్పంచ్ కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. గ్రామాన్ని మండలంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యమని, మౌలిక వసతుల కల్పనలో రాజీ పడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు. "గ్రామ ప్రజల సౌకర్యమే మా ప్రథమ ప్రాధాన్యత. ప్రతి గడపకు అభివృద్ధి ఫలాలు అందే వరకు విశ్రమించం. చిన్నమడం పల్లిని ఒక మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దుతాం." అని బానోత్ పద్మ రుప్లా నాయక్ చెప్పారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073